తవ్వేకొద్దీ కొత్త విషయాలే..

- సిట్ విచారణ తేలేదెన్నడు?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీ కేసు ఇప్పట్లో తేలేటట్టు లేదు. సిట్ విచారణలో తవ్వే కొద్దీ విషయాలు బయటకు వస్తున్నాయి. గురువారం ఉదయం రెండో రోజు పేపర్ లీకేజీపై ముగ్గురు నిందితులను సిట్ ప్రశ్నించింది. ఈ కేసులో నిందితుడు డాక్యానాయక్ ఎఇ పేపర్‌తో దాదాపు రూ.25లక్షలు వసూలు చేసినట్టు కీలక సమాచారం అందినట్టు తెలుస్తోంది. ఈ పేపర్ కోసం నీలేశ్, గోపాల్‌నాయక్ రూ.13.5 లక్షలు చెల్లించిన విషయం తెలిసిందే. అలాగే రాజేందర్ రూ.5 లక్షలు, ప్రశాంత్ రూ.7.5 లక్షలు చెల్లించినట్టు గుర్తించారు. ఏఈ ప్రశ్నాపత్రం కోసం ప్రశాంత్ బంగారం తాకట్టు పెట్టి మరీ రూ.7 లక్షలు తీసుకురాగా, మరికొందరు పొలాలూ తాకట్టు పెట్టినట్టు తెలుస్తోంది. ఈ కేసులో ఇంకా ఎంతమంది ఉద్యోగుల ప్రమేయం ఉందోనన్న కోణంలో సిట్ దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. ఇప్పటి వరకు సిట్ అధికారులు చేసిన దర్యాప్తు ప్రకారం ఎఇ పేపర్లు 12 మందికి, గ్రూప్-1 పేపర్లు ఐదుగురికి లీకైనట్టు విచారణలో తేలింది. 16 మందిని అరెస్టు చేశారు. విచారణ ఎప్పటిలోగా పూర్తి చేయాలన్నది గడువు లేకపోవడంతో విచారణ ఎప్పుడు తేలుతుందన్నది ప్రశ్నగా మిగిలింది. విచారణ ముగిసిన తర్వాతనే నివేదికను కోర్టుకు సమర్పించే అవకాశం ఉంది.

పేపర్ లీకులపై టిపిసిసి ఉద్యమ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పేపర్ లీకులపై ఉద్యమించేందుకు టిపిసిసి ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసింది. పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సూచన మేరకు గురువారం కమిటీని ప్రకటించారు. పిసిసి సీనియర్ పాధ్యక్షులు మల్లు రవి చైర్మెన్ కమిటీ ఏర్పాటైంది. కన్వీనర్లుగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి, ఎన్ ఎస్‌యూఐ అధ్యక్షులు వెంకట్, సభ్యులుగా మానవతా రాయ్, బాల లక్ష్మి, పవన్ మల్లాదిలను నియమించారు.

డ్రోన్లతో దోమల పిచికారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాంకేతిక పరిజ్ఞానంతో నగర ప్రజలకు దోమల బెడద నుంచి విముక్తితో పాటు దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల నివారణకు జీహెచ్‌ఎంసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్యాన్ని అందించి, తద్వారా జీవన ప్రమాణాల మెరుగునకు దోహదపడే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా మూసీ తీర ప్రాంతంతో పాటు నాలాలు, చెరువులపై ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నది. నీటి నిలువ ప్రదేశాల్లో దోమలను నియంత్రించడానికి సమగ్ర విధానాన్ని అనుసరిస్తూ దోమల లార్వాలను నియంత్రించుటకు డ్రోన్లను వినియోగిస్తున్నారు. ముఖ్యంగా చెరువుల్లో ఉండే గుర్రపు డెకను తొలగించడం మాత్రమే సమస్యకు పరిష్కారం కాదు, దోమల పెరుగుదలకు ప్రధాన కారణాలైనా నీటితో నిండిన ప్రదేశాలు, వృక్షసంపద, సేంద్రియ వ్యర్థాలు ఉన్న చెరువుల్లో మన్సోనియా, అర్మిజెరిస్, క్యూలెక్స్ వంటి ఇబ్బంది కలిగించే దోమలు చెరువుల్లో సామూహిక సంతానోత్పత్తికి దోహదపడుతాయి. లార్వా దశలోనే దోమలను నియంత్రించడానికి సమర్థవంతంగా దాడి చేయడమే ప్రధానంగా డ్రోన్లను వినియోగిస్తున్నది.

డ్రోన్ల వల్ల ప్రయోజనాలు

సమయం ఆదా, ఎకరం చెరువును కేవలం 10 నిమిషాల్లో పిచికారి చేయవచ్చు. చెరువులోని అన్ని భాగాలకు సులువుగా చేరడం, చెరువు అంతటా పిచికారితో పాటు సమయం, ఖర్చు ఆదా అవుతుంది.

జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆరు జోన్లలో ఒకొక జోన్‌కు ఒకటి చొప్పున మొత్తం ఆరు హెక్సకాప్టర్ డ్రోన్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 39 చెరువుల్లో పనులు పూర్తి కాగా, తాజాగా మరో 20 చెరువుల్లో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారు.దోమల సమస్య ఎకువగా ఉన్న చెరువులు, కుంటలు, కాలనీలు, క్వారీలు, ఓపెన్ ప్లాట్లు, డంపింగ్ యార్డు, మూసీనది పరీవాహక ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా రసాయనాన్ని పిచికారి చేసి దోమల లార్వా, పెద్ద దోమల నియంత్రణ చర్యలు చేపడుతున్నారు.

కార్పొరేట్లకు పన్నులు తగ్గించి..

ప్రజలను దోచుకుంటారా..?

- కేంద్ర ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి
- బిజెపిని వదిలించుకుంటేనే ధరల భారం నుంచి విముక్తి
- పెట్రో ధరల దోపిడీపై కేంద్రానికి మంత్రి కెటిఆర్ బహిరంగ లేఖ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్పొరేట్ కంపెనీలకు మేలు జరిగేలా పన్నులు తగ్గించి... సామాన్య ప్రజలను నిలువునా దోచుకుంటారా..? అని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటి రామారావు ప్రశ్నించారు. అంతర్జాతీయ ముడిచమురు ధరలు తక్కువగా ఉన్నా, పెట్రో ఉత్పత్తుల ధరలను విపరీతంగా పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 2013లో ఒక బ్యారెల్ ముడి చమురు ధర 110 డాలర్లు ఉన్నప్పుడు, దేశంలో లీటర్ పెట్రోల్ రేటు కేవలం రూ.76 ఉండేదని, నేడు బ్యారెల్ ముడిచమురు రేటు దాదాపు సగం పడిపోయినా పెట్రోల్ ధర లీటర్ కు రూ.110 ఉండడమే కేంద్రం దోపిడీకి నిదర్శనమన్నారు. దేశంలో పెట్రోల్ ధరల పెంపునకు ముడిచమురు కారణం కాదని, మోడీ నిర్ణయించిన చమురు ధరలేనని మరోసారి రుజువైందని కెటిఆర్ పేర్కొన్నారు. పెట్రో ధరల దోపిడీని నిలదీస్తూ కెటిఆర్ గురువారం కేంద్రానికి లేఖ రాశారు.

పెట్రోల్ డీజిల్ ధరలను విపరీతంగా పెంచడం వల్ల దేశంలోని పేద, సామాన్య మధ్యతరగతి ప్రజానీకం ధరల భారంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతోందన్నారు. 2014 నుంచి ఇప్పటిదాకా దాదాపు 45శాతం పైగా పెట్రో ధరల పెంపు వల్ల సరుకు రవాణా భారమై, నిత్యావసరాల ధరలన్నీ భారీగా పెరిగాయని చెప్పారు. అలాగే కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల గత నలభై ఐదు సంవత్సరాలలో ఎప్పుడు లేనంత ద్రవ్యోల్బణం దేశాన్ని పట్టిపీడిస్తోందన్నారు. ఇన్నాళ్లు అంతర్జాతీయ ముడి చమురు ధరల ప్రస్తావన, లేదా ఉక్రెయిన్- రష్యా యుద్ధం పేరు చెప్పి దేశ ప్రజలను మోడీ మభ్యపెట్టారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న 35 వేల కోట్ల రూపాయల ముడిచమురు పొదుపు ప్రయోజనమంతా కేవలం ఒకటి రెండు ఆయిల్ కంపెనీలకే దక్కిందన్నది వాస్తవమని స్పష్టంచేశారు. దేశీయ వినియోగం పేరు చెప్పి భారీగా రష్యా నుంచి దిగుమతి చేసుకున్న ముడిచమురును, శుద్ధి చేసి తిరిగి విదేశాలకు అమ్ముకుంటున్న కేంద్ర ప్రభుత్వం ఓ దోపిడీదారుగా తయారైందని విమర్శించారు. విదేశాలకే పెట్రోలు అమ్ముతున్న ఆయిల్ కంపెనీలకు వస్తున్న లాభాలపై ప్రభుత్వానికి వచ్చే విండ్ ఫాల్ పన్నును ఎందుకు తగ్గించాల్సి వచ్చిందని కెటిఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర 2013 సంవత్సరంలో ఉన్న స్థాయికి పడిపోయిన నేపథ్యంలో భారీగా పెంచిన, పెట్రోల్ రేటును తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ లాంటి రాష్ట్రాలు 2014 నుంచి ఒక్క రూపాయి వ్యాట్‌ను పెంచకున్నా, కేంద్ర ప్రభుత్వం మాత్రం సెస్సుల పేరుతో 30 లక్షల కోట్లకు పైగా ప్రజల నుంచి కొల్లగొట్టిందన్నారు. సెస్సులను పూర్తిగా ఎత్తివేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. జిఎస్‌టి పరిధిలో ఉన్న వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.400 నుంచి రూ.1200కు పెంచిన అసమర్థ కేంద్ర ప్రభుత్వం కేంద్రంలో ఉన్నదని దుయ్యబట్టారు. ధరల పెరుగుదల అంశం పార్లమెంటులో చర్చకు రాకుండా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. సామాన్యులపై ధరల భారం తగ్గాలంటే బిజెపిని వదిలించుకోవడమే ఏకైక మార్గమని కెటిఆర్ లేఖలో పేర్కొన్నారు.

తెలంగాణ అంటే ప్రాధాన్యంలేని బిజెపి మనకెందుకు : కెటిఆర్

కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీపై తెలంగాణ మంత్రి కెటిఆర్ మరో సారి విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రధాని మోడీ ప్రాధాన్యతలో తెలంగాణ లేదని.. అలాంటప్పుడు రాష్ట్ర ప్రజల ప్రాధాన్యతలో మాత్రం ప్రధాని మోడీ,బిజెపి ఎందుకుండాలని కెటిఆర్ ప్రశ్నించారు. రాష్ట్రానికి ఏమీ ఇచ్చేది లేదని మోదీ సర్కారు తేల్చి చెప్పిందన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఆయన గురువారం ట్వీట్ చేశారు. "తెలంగాణకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, పసుపు బోర్డు ఇవ్వనని మోడీ చెప్పారు. మెట్రో రెండో దశ, ఐటిఐఆర్, గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హెూదా ఇచ్చేది లేదని తేల్చేశారు. రాష్ట్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చేది లేదన్నారు. విభజన చట్టంలోని హామీలను మోదీ అమలు చేయట్లేదు. వీటన్నింటికీ రాష్ట్రంలోని నలుగురు బిజెపి ఎంపీలు బాధ్యత వహించాలి. తెలంగాణకు కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వడం లేదు కానీ, ప్రధాని రాష్ట్రం గుజరాత్‌కు లోకోమోటివ్ కోచ్ ఫ్యాక్టరీకి రూ.20వేల కోట్లు ఇచ్చారు. గుజరాతీ బాసుల చెప్పులు మోసే దౌర్భాగ్యులను ఎన్నుకున్న ఫలితమిది" అని మంత్రి కెటిఆర్ ట్వీట్ చేశారు.

రాష్ట్ర చరిత్రలో అత్యధిక విద్యుత్ వినియోగం

- 15,497 మెగా వాట్ల విద్యుత్ నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ వినియోగం నమోదయింది. గురువారం ఉదయం 11.01 నిమిషాలకు 15,497 మెగా వాట్ల విద్యుత్ (అత్యధిక పీక్ డిమాండ్) నమోదు అయ్యిందనివిద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. మార్చి నెల ఆరంభం నుంచే 15,000 మెగా వాట్ల విద్యుత్ వినియోగం నమోదు అవుతూ వస్తోందని పేర్కొన్నారు.

వేసవికాలంలో ఉష్ణోగ్రతలు అధికం కావడం, వ్యవసాయ రంగానికి విద్యుత్ వినియోగం పెరగడంతో రాష్ట్రంలో రోజురోజుకీ విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ వినియోగం అధికమవుతోంది. మొత్తం విద్యుత్ వినియోగంలో వ్యవసాయ రంగానికే 37 శాతం వాడినట్లు నమోదైంది. మొత్తం విద్యుత్ వినియోగంలో దక్షిణ భారతదేశంలో తమిళనాడు మొదటి స్థానం కాగా, రెండో స్థానంలో తెలంగాణ నిలిచింది. బుధవారం 14,422 మెగా వాట్లు కాగా రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అత్యధికంగా రికార్డు స్థాయిలో గురువారం 15,497 మెగా వాట్ల విద్యుత్ డిమాండ్ నమోదు కావడం ఇదే తొలిసారి.

డిమాండ్ పెరిగినా సరఫరాకు అంతరాయం ఉండదు - సిఎండి ప్రభాకర్ రావు

"ఈ ఏడాది వేసవి కాలంలో 16 వేల మెగా వాట్ల డిమాండ్ వచ్చే అవకాశం ఉంది. ఎంత డిమాండ్ వచ్చిన సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం. మార్చి నెలలో 15,000 మెగా వాట్ల విద్యుత్ డిమాండ్ నమోదు అవుతోందని ముందే ఊహించాం. అందుకు సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరాకు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేశాం. రాష్ట్ర రైతాంగానికి, అన్ని రకాల వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం" అని ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి ప్రభాకర్ రావు తెలిపారు.

బాదాములతో సంపూర్ణ ఆరోగ్యం

హైదరాబాద్ : ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా సంస్థ గురువారం హైదరాబాద్‌లో 'ఆయుర్వేద, న్యూట్రిషనల్ సైన్స్‌తో సంపూర్ణ ఆరోగ్యం పొందడం'అనే అంశంపై చర్చా వేదిక నిర్వహించింది. సెలబ్రిటీ ఫిట్‌నెస్ ట్రైనర్ కిరణ్ డెంబ్లా, న్యూట్రీషన్, వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి, ఆయుర్వేద నిపుణులు డాక్టర్ నితిక కోహ్లీ ఈ చర్చలో పాల్గొని మాట్లాడారు. ఆర్‌జె షెజ్జీ ఈ చర్చకు మోడరేటర్‌గా వ్యవహారించగా.. వ్యక్తలు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల మెరుగైన ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. స్నాక్స్‌కు బదులుగా సంప్రదాయ, రుచికరమైన ఆహారం అయిన బాదములు, మిల్లెట్స్, ఉసిరికాయ, రెడ్ రైస్ వంటివి తీసుకోవాల్సిందిగా సూచించారు.

దళితుడి హత్య అమానవీయం

- నిందితులను పట్టుకోవడంలో పోలీసుల తాత్సారం సరికాదు
- దళిత బహుజనఫ్రంట్, మానవ హక్కుల వేదిక నిజనిర్ధారణ బృందం



నిజ నిర్ధారణ బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైరు దొంగతనం చేశాడని ఒక దళితుడిని రాత్రంతా చిత్రహింసలకు గురిచేసి కరెంట్ షాక్ పెట్టి మరీ చంపడం అమానవీయమని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్, రాష్ర కార్యదర్శి పులి కల్పన, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి షేక్ అహ్మద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రంలో ఇటీవల దొంగతనం నెపంతో బేగ బుడగ జంగంకు చెందిన దళితుడైన మల్లేష్‌ను హత్య చేసిన ఘటనపై గురువారం డిబిఎఫ్, హెచ్‌ఆర్‌ఎఫ్ నిజ నిర్ధారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి మోసం చేయడంతోనే ఇలాంటి ఘటనల్లో దళితులు బలి పశువులు అవుతున్నారని ఆరోపించారు. మల్లేష్‌ను గత శనివారం అర్ధరాత్రి పొలం దగ్గర కొంతమంది రైతులు పట్టుకొని చిత్రహింసలకు గురి చేస్తూ.. జాతీయ రహదారిపై ఉన్న రైతుసంఘ భవనం ఎదుట 40 మందికి పైగా మూకుమ్మడిగా దాడి చేశారని తెలిపారు. అంతేకాకుండా భవనం ఎదుట ఉన్న చెట్టుకు కట్టేసి కొట్టి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హత్యపై పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసినప్పటికీ నిందితులను అరెస్ట్ చేయడంలో తాత్సారం ప్రదర్శించడం తగదన్నారు. తక్షణమే వారికి అరెస్ట్ చేసి శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని పోలీసులను కోరారు. అలాగే, బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధకచట్టం ప్రకారం రూ8.25 లక్షల నష్టపరిహారాన్ని వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. తక్షణ సహాయంగా బియ్యం, నూనె, పప్పు దినుసులు అందించాలని కోరారు. బాధిత కుటుంబంలో ముగ్గురు పసిపిల్లలున్నారని, వారిని సంక్షేమ గురుకులాల్లో చదివించేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత మహిళకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, పెన్షన్ అందించాలని కోరారు. గ్రామంలోని బేడ బుడగ జంగం కులానికి చెందిన దళితులకు ఉపాధి హామీ కార్డులు అందించకపోవడం సిగ్గుచేటని, వెంటనే జాబ్ కార్డులను అందజేసి పని కల్పించాలన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లేక తిండి దొరకక ఇలాంటి చిన్న దొంగతనాలు చేస్తూ దళితులు హత్యలకు గురి కావడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే ఉపాధి అవకాశాలు కల్పిస్తే దళితులు ఆత్మగౌరవంతో బతుకుతారని, టిఆర్‌ఎస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా దళితులకు మూడెకరాల భూమిని ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. ఈ ఘటనలో మొదటి ముద్దాయి రాష్ట్ర ప్రభుత్వమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పారిశ్రామిక వాడలో అందని వైద్యం

- ఇఎస్ఐ దవాఖానా జాడేదీ..
- 60 వేల మంది కార్మికులు.. 400 పైగా పరిశ్రమలు
- బొల్లారంలో స్థల సేకరణ.. భవన నిర్మాణం పట్ల అశ్రద్ధ
- డిస్పెన్షరీల్లో వైద్య పరీక్షల్లేవ్.. మందుగోలి కరువు
- వంద పడకల ఆస్పత్రి నిర్మించాలని సిఐటియు పోరాటాలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ మెడికల్ హబ్‌గా మారుతుంది. అత్యాధునిక ఆస్పత్రులు, వైద్య కళాశాలలు విస్తరిస్తున్నాయి.. అయితే, పారిశ్రామిక వాడల్లో కార్మికులకు ఉచిత వైద్యం అందని ద్రాక్షలా మారింది. ఇక్కడ వేలాది మంది కార్మికులు, కుటుంబ సభ్యులు నివసిస్తున్నారు. జబ్బు చేస్తే మెరుగైన వైద్య అందే పరిస్థితి లేదు. డిస్పెన్షరీల్లో మందుగోలి సైతం దొరకదని ఆవేదన చెందుతున్నారు. అత్యాధునిక సౌకర్యాలతో వంద పడకల ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

సంగారెడ్డి జిల్లాలో పటాన్‌చెరువు, ఐడిఎ బొల్లారం, బొంతపల్లి, గడ్డపోతారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడలుగా విస్తరించాయి. ఈ ప్రాంతంలో సుమారు 400కి పైగా వివిధ రకాల పరిశ్రమలు ఉన్నాయి. వీటిల్లో దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన 60 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. మహారాష్ట్ర, బీహార్, జార్జండ్, ఛత్తీస్‌గఢ్, బెంగాల్, కర్నాటక, తమిళనాడు, ఎపితో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వలసొచ్చిన కార్మికులున్నారు. ఈ ప్రాంతంలో ఇఎస్ఐ ఆస్పత్రి లేకపోవడంతో కార్మికులకు అత్యవసర సమయాల్లో వైద్యం అందడం లేదు. పరిశ్రమల్లో నిత్యం పొల్యూషన్ మధ్య పనిచేయడం, కుటుంబాలు ఆ ప్రాంతంలోనే నివసించడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. కెమికల్, ఫార్మా, ఇతర పరిశ్రమల్లో ప్రమాదాలు తరచూ జరగడంతో కార్మికులు గాయాలపాలవుతున్నారు. సరైన సమయానికి వైద్యమందక జనవరి మాసంలో జరిగిన ప్రమాదాల్లోనే ఆరుగురు కార్మికులు చనిపోయారు. ఇటీవల కాలంలో గడ్డపోతారం, బొల్లారం, బొంతపల్లి, పటాన్‌చెరు, ఖాజీపల్లిలో వివిధ పరిశ్రమల్లో 58 అగ్ని ప్రమాదాలు జరిగాయి. వీటిల్లో 45 మంది కార్మికులు చనిపోయారు. 161 మంది గాయపడ్డారు. అత్యవసర వైద్యమందకపోవడం వల్ల కొందరు చనిపోయారు. స్థానికంగా ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని కార్మికులు కోరుతున్నారు. వంద పడకల ఆస్పత్రి నిర్మించాలని సిఐటియు అనేక పోరాటాలు చేసింది.

వంద పడకల ఆస్పత్రి అవసరం

పారిశ్రామిక వాడలో 60 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరి కుటుంబ సభ్యులతో కలిసి లక్షకు పైగా కార్మిక జనాభా ఉంది. కార్మికుల కోసం బొల్లారంలో ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం చేయాలని స్థలం సేకరించారు. మూడేండ్లు కావస్తున్నా ఆస్పత్రి నిర్మించలేదు. కనీసం పునాదీ తవ్వలేదు. స్థానికంగా మెరుగైన వైద్యం అందించేందుకు బొల్లారంలో వంద పడకల ఆస్పత్రి నిర్మించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. సిటీస్కానింగ్, ఎంఆర్ఐ, ఇతర వైద్య పరీక్షలు, ఆపరేషన్లు, అత్యవసర వైద్యం, 24 గంటలు డాక్టర్లు, సిబ్బంది, అంబులెన్స్, అవసరమైన మందుల సౌకర్యం అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నారు.

మొక్కుబడి డిస్పెన్షరీలు

కార్మికులకు వైద్యం అందించేందుకు ఈఎస్ఐ డిస్పెన్షరీలు పెట్టారు. బొంతపల్లిలో శిథిలావస్థలో ఉన్న అద్దె ఇంట్లో డిస్పెన్షరీ నడుస్తోంది. ఎప్పుడు కూలుద్దో అన్న టెన్షన్‌లో వైద్య సిబ్బంది ఉంటున్నారు. మరో డిస్పెన్షరీ రంగారెడ్డి జిల్లా బాచుపల్లిలో ఉంది. అక్కడికి సంగారెడ్డి జిల్లాలోని బొల్లారం, ఇతర కార్మికులు వెళ్లి వైద్యం చేయించుకోవాలంటే ఇబ్బందిగా ఉందంటున్నారు. బాచుపల్లిలో ఉన్న డిస్పెన్షరీని బొల్లారానికి మార్చాలని కార్మికులు, సిఐటియు ఎప్పటి నుంచో పోరాడుతున్నాయి. అత్యవసర పరిస్థితిలో సనత్‌నగర్‌లో ఉన్న ఆస్పత్రికి వెళ్లితే ఇన్‌పేషెంట్లకు మాత్రమే వైద్యం అందుతోంది.

వంద పడకల ఆస్పత్రి నిర్మించాలి

మెరుగైన వైద్య సదుపాయాల కోసం బొల్లారంలో అత్యాధునిక సదుపాయాలతో వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలి. ఆస్పత్రి కోసం గతంలోనే స్థలం సేకరించారు. నిర్మాణం గురించి పట్టించుకోవడంలేదు. ఆరోగ్య శాఖ మంత్రి హారీశ్‌రావుకు అనేకసార్లు లేఖలు రాశాం. విన్నతిపత్రాలిచ్చాం. పారిశ్రామిక ప్రాంతంలో రోడ్లు అధ్వానంగా ఉండటం వల్ల అత్యవసర వైద్యం కోసం దూరం వెళ్లాల్సి వస్తే ఇబ్బందులు కల్గుతున్నాయి.

కె.రాజయ్య- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు

పారిశ్రామిక వాడల్లో ఉన్న కార్మికులకు ఇఎస్ఐ ఆస్పత్రి లేక అవస్థలు

ఇఎస్ఐ ఆస్పత్రి లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. అనారోగ్యం పాలైతే డిస్పెన్షరీకి వెళ్తే గోలీలిచ్చి పంపుతున్నారు. బాచుపల్లికి వెళ్లి రావాలంటే ఇబ్బందిగా ఉంది. బొల్లారంలో ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మించి వైద్యం అందుబాటులోకి తేవాలి.

మహిళా జర్నలిస్టులందరికీ ఆరోగ్య పరీక్షలు

- ఐఅండ్‌పిఆర్ కమిషనర్ అర్వింద్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మహిళా జర్నలిస్టులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ అర్వింద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి వచ్చే నెల తొమ్మిదవ తేదీ వరకు నిర్వహించే ఈ మాస్టర్ హెల్త్ చెకప్‌లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన అక్రిడిటెడ్ మహిళా జర్నలిస్టులతోపాటు పత్రికా, న్యూస్ ఛానెళ్లలో పనిచేస్తూ ఆర్గనైజేషన్ గుర్తింపు కార్డులు ఉన్న మహిళా జర్నలిస్టులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే రక్త పరీక్ష, బ్లడ్ షుగర్, డయాబెటిక్ పరీక్షలు, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, కాల్షియం, మూత్ర పరీక్షలు, విటమిన్ బి12 డి3 మొదలైనవి, ఇసిజి, ఎక్స్-రే, అల్ట్రాసోనోగ్రఫీ, మామోగ్రామ్, పాప్ స్మెర్ వంటి రోగనిర్ధారణ పరీక్షలు ఉంటాయని తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షలు, మెడికల్ ఆఫీసర్ ఎగ్జామినేషన్, ఐ స్క్రీనింగ్, డెంటల్ పరీక్షలు, గైనకాలజీ పరీక్షలు మొదలైనవి ఉంటాయనీ, పరీక్షల నివేదికలను అదే రోజున అందజేయనున్నట్టు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- ఆర్‌టిసి బస్సు, ద్విచక్రవాహనం దగ్ధం
- బైక్‌ను ఢీకొనడంతో ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి బస్సు ఢీకొని ద్విచక్రవాహదారుడు మృతి చెందారు. ద్విచక్రవాహనం, బస్సు మంటల్లో దగ్ధమైంది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండల పరధిలోని ఇందిరానగర్ సమీపంలో 65 జాతీయ రహదారిపై గురువారం జరిగింది. ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం ..

హైదరాబాద్ మియాపూర్ డిపోకు చెందిన ఆర్‌టిసి రాజధాని ఎసి బస్సు విజయవాడకు వెళ్తోంది. అయితే, ఇందిరానగర్ సమీపంలో గ్రామానికి చెందిన రాజు ద్విచక్రవాహనంపై పొలానికి వెళ్లి ఇంటికి వచ్చే క్రమంలో మట్టి రోడ్డు నుంచి జాతీయ రహదారి ఎక్కుతుండగా బస్సు ఢీకొట్టింది. క్షణాల్లోనే స్కూటీ నుంచి మంటలు లేచి బస్సు ముందు భాగానికి అంటుకున్నాయి. దట్టంగా పొగలు కమ్ముకోవడంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును పక్కకు ఆపేసి ప్రయాణికులను వెంటనే దింపేశాడు. సంఘనా స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకునే సమయానికే బస్సు, స్కూటీ మొత్తం కాలిపోయాయి. ప్రయాణికుల సామాన్లు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మురుగేష్ రాజు (45) తీవ్రంగా గాయపడటంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతిచెందాడు. బస్సులో వున్న 13 మందిని ఇతర వాహనాల్లో పంపించారు. ఘటనా స్థలంలో దట్టంగా పొగ కమ్ముకోవడంతో జాతీయ రహదారిపై పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. మునగాల సిఐ ఆంజనేయులు పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇడి చేతికి డేటా చోరి కేసు

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న వ్యక్తిగత డేటా చోరీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు రంగంలోకి దిగారు. సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా 16.8 కోట్ల మంది వ్యక్తిగత సమాచారం లీకైనట్లు సైబరాబాద్ పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ మేరకు ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. డేటా చౌర్యం చేస్తున్న ముఠాను అరెస్టు చేశారు. నిందితుల వద్ద రక్షణ రంగంతోపాటు.. బ్యాంకు, పాన్ కార్డు, డెబిట్, క్రెడిట్ కార్డుదారుల వ్యక్తిగత వివరాలున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను కస్టడీలోకి తీసుకొని ప్రశ్నిస్తున్న క్రమంలో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

జస్ట్ డయల్ ద్వారా సమాచారాన్ని అమ్మకానికి పెట్టినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. పలు ఏజెన్సీల నుంచి ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు, మెయిల్ ఐడి వంటి వివరాలు సేకరిస్తున్న ముఠా అంగట్లో అమ్మకానికి పెట్టినట్లు గుర్తించారు. రుణాలు ఇచ్చే సంస్థలు ఈ డేటాను అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. రక్షణ రంగానికి చెందిన అధికారుల ఫోన్ నెంబర్లు, వాళ్ల పనిచేసే ప్రాంతం, మెయిల్ ఐడిలు కూడా అమ్మకానికి పెట్టడంతో ఆర్మీ ఉన్నతాధికారులు సైతం సైబరాబాద్ పోలీసులతో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. దేశ వ్యాప్తంగా డేటా చౌర్యం జరిగినట్లు తేలడంతో ఇడి అధికారులు రంగంలోకి దిగారు. మనీలాండరింగ్ జరిగినట్లు అనుమానిస్తున్న అధికారులు పిఎంఎల్‌ఎ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీసుల నుంచి కేసుకు సంబంధించిన వివరాలు సేకరించారు. ఇడి అధికారులు సైతం నిందితులను కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

లక్ష్యానికి చేరువలో పామాయిల్ సాగు

- 27 జిల్లాలకు విస్తరణ
- విస్తృతంగా రైతుల్లో అవగాహన
- ఎన్ని మొక్కలకైన సబ్సిడీ...
- విదేశాల నుంచి మొక్కల దిగుమతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలో క్రమక్రమంగా 20 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది లక్ష ఎకరాల్లో సాగు చేయాలని నిర్ణయించిన ఉద్యాన శాఖ... ఇప్పటికే 76 వేల ఎకరాల్లో మొక్కలు నాటడం పూర్తి చేసింది. రాష్ట్రంలో అక్కడక్కడ రైతులు సాగు చేస్తున్నప్పటికి మొత్తంగా 27 జిల్లాలకు పామాయిల్ సాగు విస్తరించినట్టు అధికారులు చెబుతున్నారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో జోరుగా సాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 15వేల పామాయిల్ రైతులను నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు తీసుకెళ్లి అక్కడ కొనసాగుతున్న సాగుపై రైతులకు అవగాహన కల్పించింది. దీంతో ఆయా జిల్లాల రైతులు సైతం పామాయిల్ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లా కలెక్టర్లు, ఉద్యాన శాఖ అధికారులు, స్థానికంగా వ్యవసాయ విస్తరణాధికారులు (ఎఇఒ) ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. కొన్ని చోట్ల మాత్రం రైతులను ఒప్పించేలా ఎఇఒలకు టార్గెట్లు పెడుతున్నట్టు సమాచారం. అధికారులకు, రైతులకు మధ్య ఎఇఒలు నలిగిపోతున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని పామాయిల్ మొక్కలు నాటినా సబ్సిడీ అందుతోంది. కానీ అదే డ్రిప్ ఇరిగేషన్ విషయంలో పన్నెండున్నర ఎకరాలకు పరిమితి ఉంది. డ్రిప్ సబ్సిడీ వర్తించదు. దీంతోపాటు మూడేండ్ల తర్వాత పంట చేతికొస్తుండటంతో సన్న, చిన్నకారు రైతులు పెద్ద ఆసక్తి చూపడం లేదు. దీర్ఘకాలంలో అత్యధిక ప్రయోజనాలు ఉండటంతో అంతవరకు ఆర్థికంగా తట్టుకుని నిలబడగలిగిన పెద్ద రైతులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు... ఈ పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు. అంతర పంటలకూ సబ్సిడీ వస్తోంది. కూలీల ఖర్చు తక్కువ. బై బ్యాక్ సౌకర్యం ఉంది. ఒక్కసారి మొక్క నాటితే 30 ఏళ్లు నిరంతరాయంగా దిగుబడి వస్తోంది. దీనికి కావాల్సింది ఒక్కటే పుష్కలమైన నీరు ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహించడంతో ఓ మంత్రి రెండు వందల ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నట్టు తెలిసింది. మరో ఎమ్మెల్యే పెద్ద ఎత్తున సాగు చేయడం ద్వారా ఇతర రైతులను ప్రోత్సహిస్తున్నట్టు సమాచారం. మొక్క ప్రారంభంలో కొమ్ము పురుగు సోకుతుంది. దాని నివారణకు మందులు ఉపయోగించాల్సి ఉంటుంది. పామాయిల్ మొక్కలకు కోతులు, పందులు, పశువుల బెడద ఉండదు. దీంతోపాటు ప్రభుత్వమే పామాయిల్ గెలలకు ధర నిర్ణయిస్తుంది. ఇది రైతుకు భరోసా నిస్తుంది. పామాయిల్ మొక్కలు ఏపుగా పెరిగిన తర్వాత అదనపు ఆదాయం కోసం రైతులు మేకలను, గొర్రెలను, పశువులు, కోళ్లను పెంచుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పామాయిల్ గెలలు అమ్ముకునేందుకు 11 కంపెనీలకు అనుమతి ఇచ్చింది. 40 ఎకరాల్లో పామాయిల్ సాగు పూర్తి అయిన తర్వాత ఆయా ప్రాంతాల్లో కంపెనీలు నిర్మాణ పనులు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. అయితే పామాయిల్ మొక్కలను ప్రయివేటుగా అమ్ముకునేందుకు అనుమతి లేదు. ప్రభుత్వమే రైతులకు సబ్సిడీ మీద సరఫరా చేస్తోంది. ఎవరైనా ప్రయివేటు సంస్థలు మొక్కలు సరఫరా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.

జీడిమెట్లలో కూలిన భవనం

హైదరాబాద్ : జీడిమెట్ల పరిధిలోని చెరుకుపల్లిలో 40 ఏండ్ల నాటి ఓ పాత భవనం గురువారం సాయంత్రం ఆకస్మాత్తుగా కుప్పకూలిపోయింది. ఆ పాత భవనానికి మరమ్మతులు చేస్తుండగా కుప్పకూలిపోయినట్లు స్థానికులు తెలిపారు. పక్కనున్న మూడు భవనాలపై శిథిలాలు పడటంతో గోడలు దెబ్బతిన్నాయి. దీంతో ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. కూలిన భవనంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, పరిస్థితిని సమీక్షించారు

విద్యార్థులపై అణచివేత తగదు : వైఎస్‌ షర్మిల

ప్రజాశక్తి -హైదరాబాద్‌ బ్యూరో

పేపర్‌ లీకులపై ఉద్యమిస్తున్న ఒయు, కెయు విద్యార్థులపై సర్కార్‌ అణచివేత చర్యలను మానుకోవాలని వైఎస్‌ఆర్‌టిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్‌ షర్మిల గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా వారిపై నిర్బంధాన్ని ప్రయోగించడమేంటని ప్రశ్నించారు. నోరెత్తితే కేసులు పెడతామని బెదిరించడం తగదని పేర్కొన్నారు. మా ఉద్యోగాలు మాకే అంటూ విద్యార్థులు కొట్లాడకపోతే తెలంగాణ వచ్చేదా? అని ప్రశ్నించారు. లీకులతో ఉద్యోగాలకు లాఠీలు పద్దాయని ఎద్దేవా చేశారు. 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలను పాలకులు అంగట్లో పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు అడుగుతున్నట్లు ఈ కేసును సిబిఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్‌ చేశారు.

వెయ్యి మంది టెక్నాలజీ కన్సల్టెంట్లను జోడిస్తాం

- ఫ్లూరల్‌ టెక్నాలజీ సిఇఒ వెల్లడి

హైదరాబాద్‌ : వచ్చే మూడేళ్లలో వెయ్యి మంది టెక్నాలజీ కన్సల్టెంట్లను జోడించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఫ్లూరల్‌ టెక్నాలజీ సిఇఒ సునీల్‌ సవరం తెలిపారు. అందులో 500 మంది జపనీస్‌ భాషలో శిక్షణ పొందుతారని గురువారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025 నాటికి ఫ్లూరల్‌ టెక్నాలజీ, ఒపెన్‌సెసమీ టెక్నాలజీ ఐఎన్‌సిలు కలిసి వంద మిలియన్ల వ్యాపారాన్ని సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయన్నారు. ఫ్లూరల్‌ టెక్నాలజీ, జపాన్‌లోని ఓపెన్‌ సెసమ్‌ టెక్నాలజీ ఇటీవల ఈ దేశంలో తమతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ప్రస్తుతం రెండు కంపెనీలు కలిసి దాదాపు 500 మంది ఉద్యోగులను కలిగి ఉన్నాయన్నారు. మరో వెయ్యి మంది సాంకేతిక సలహాదారులను జోడించుకోవాలని నిర్దేశించుకున్నామన్నారు.

గోడాడీ డొమైన్లపై ప్రత్యేక ఆఫర్లు

న్యూఢిల్లీ : భారతీయ చిన్న వ్యాపార పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాన్ని ఆన్‌లైన్‌లో పెంచుకోవడానికి ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నట్లు గోడాడీ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు ఆఫర్‌ కింద తొలి ఏడాదికి ఇన్‌తో ముగిసే డొమైన్ల కోసం రూ.49కి, ఇన్ఫో డొమైన్లను రూ.319కి, కామ్‌తో ముగిసే డొమైన్లను రూ.499కి, ఒఆర్‌జి డొమైన్లను రూ.749కే అందిస్తున్నట్లు తెలిపింది. ఈ ఆఫర్లు మార్చి 31 వరకు అందుబాటులో ఉంటాయని తెలిపింది.

కుంచించుకుపోతున్న ఒయు

- కోఠి మహిళా కళాశాల యూనివర్సిటీగా మార్పు
- ఒయుకు మహిళా కళాశాల ఎక్కడ ?
- దూరదృష్టి లోపించిన అధికారులు
- మరోచోట కొత్తగా ఏర్పాటు చేయాలని డిమాండ్‌
- కోఠి కళాశాలలో యూనివర్సిటీని వ్యతిరేకిస్తున్నాం : ప్రొ. మనోహర్‌



ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

ఒయు అస్తిత్వం నానాటికీ కుచించుకుపోతున్నది. గతంలో తెలంగాణ ప్రాంతంలో అతిపెద్ద విశ్వవిద్యాలయంగా ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ (ఒయు) నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నూతన యూనివర్సిటీల స్థాపనతో పరిధి కుచించుకుపోయింది. నూతనంగా తెలంగాణ ప్రభుత్వం కోఠి మహిళా కళాశాలను తెలంగాణ మహిళా యూనివర్సిటీగా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇది హర్షించదగ్గ విషయం. అయితే ఓయూ విద్యార్థినుల అస్తిత్వానికి ప్రతీక అయిన కోఠి మహిళా కళాశాలను వదులుకోకుండా ఓయూ అధికారులు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించకపోవడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేశారు. మరోచోట మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసి, కోఠి మహిళా కళాశాలను ఓయూ పరిధిలోనే ఉంచాలని కోరుతున్నారు.

ఓయూ కోఠి మహిళా కళాశాలను సాంకేతికంగా వర్సిటీగా ఉన్నతీకరించడం మాత్రమే సరిపోదు. అందుకు అవసరమైన వసతులు కావాలి. చారిత్రాత్మక కట్టడాలు, అపూర్వమైన వారసత్వపు సంపద ఆ ప్రాంగణంలో ఉన్న కారణంగా మహిళా యూనివర్సిటీ విస్తరణకు తగినంత అవకాశం లేదని పలువురు సూచిస్తున్నారు. ఓయూ కోఠి ఉమెన్స్‌ కళాశాలను వదులుకోవడమే కాదు ఇక్కడ మనమైన సాంస్కృతిక, చారిత్రక, వారసత్వ సంపదను ఓయూ అధికారులు వదులుకోవడం సరికాదని యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేజారిన కోఠి ఉమెన్స్‌ కాలేజ్‌..

ప్రభుత్వం మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసే క్రమంలో ఓయూ అధికారులు ఒక సుదీర్ఘ ప్రణాళికతో ఆలోచించి, ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వం ముందుంచితే బాగుండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోఠి మహిళా కళాశాల అస్తిత్వాన్ని ఓయూలోనే కొనసాగించాలని, ఎందుకంటే 104 సంవత్సరాల ఓయూ వారసత్వంలో కోఠి ఉమెన్స్‌ కళాశాల ఒక కలికితురాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఓయూ అధికారులు సరైన చర్య జరిపి విద్యావంతుల నుంచి ప్రతిపాదనలు స్వీకరించి కోఠి ఉమెన్స్‌ కళాశాల ప్రాంగణాన్ని చేజారకుండా యథాతథంగా కళాశాలను ఇక్కడే కొనసాగించాలని విద్యార్థినులు డిమాండ్‌ చేస్తున్నారు. అదే విధంగా, మహిళా యూనివర్సిటీకి అన్ని రకాల, నిధులు, నియామకాలు, వసతులు కల్పిస్తూ ఆధునాతన ప్రాంగణంలో అందరికీ అందుబాటులో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

యూనివర్సిటీ వ్యతిరేకిస్తున్నాం.. జెఎసి అధ్యక్షుడు ప్రొఫెసర్‌ మనోహర్‌

ఓయూకు సంబంధించిన కోట్లది రూపాయల విలువైన భూముల్లో మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి వ్యతిరేకిస్తున్నాం. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నూతనంగా 100 ఎకరాల్లో, వసతులు, నిధులు, నియామకాలు ఏర్పాటు చేసి యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. కానీ కేవలం ఓయూ కోఠి ఉమెన్స్‌ కళాశాల బోర్డు మార్చి ఇలా చేయడం బాధాకరం. ఖరీదైన ఓయూ భూముల్ని, సౌకర్యాలు చేతులారా కోల్పోతున్నాం.

104 ఏళ్ల ఓయుకు మహిళా కళాశాల కరువు ఓయు ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు రవినాయక్‌, జ్ఞానేశ్వర్‌

ఓయూలో సకల సౌకర్యాలతో ఉన్న కోఠి ఉమెన్స్‌ కళాశాల పేరు మార్చారే తప్ప కొత్తగా రాష్ట్రానికి, విద్యార్థినులకు ఒరిగిందేమీ లేదు. 104 ఏండ్ల ఓయూకు మహిళా కళాశాల లేకపోవడం తీరని లోటు. యూనివర్సిటీని కొత్తగా ఇతర చోట ఏర్పాటు చేస్తే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిన వారవుతారు. కోఠి కళాశాలను ఓయూ పరిధిలోనే ఉంచాలి.

టిఎస్‌ఆర్‌జెసి సెట్‌ దరఖాస్తులకు గడువు తేది పొడిగింపు

ప్రజాశక్తి -హైదరాబాద్‌ బ్యూరో

టిఎస్‌ఆర్‌జెసి సెట్‌ 2023 ప్రవేశ పరీక్షల దరఖాస్తు తేదీని పొడిగిస్తున్నట్లు తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సిహెచ్‌ రమణకుమార్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర గురుకుల (రెసిడెన్షియల్‌) జూనియర్‌ కాలేజీలలో 2023-24 విద్యా సంవత్సరానికిగాను ఇంటర్‌ మొదటి సంవత్సరం (ఇంగ్లీష్‌ మీడియం) ఎంపిసి, బైపిసి, ఎంఇసిలో 35 గురుకుల జూనియర్‌ కళాశాలల్లో ప్రవేశం కోసం మే 5న నిర్వహించే టిఎస్‌ఆర్‌జెసి-సెట్‌ 2023 ప్రవేశ పరీక్షకు ఏప్రిల్‌లో పదో తరగతి పరీక్షకు హాజరవుతున్న తెలంగాణ 33 జిల్లాల విద్యార్థుల నుండి ఆన్‌లైన్‌ http://tsrjdc.cgg.gov.in ద్వారా ఈ నెల 31వ తేదీ దరఖాస్తులు స్వీకరించుటకు ప్రకటించిన విషయం తెలిసిందే. తల్లిదండ్రుల కోరిక మేరకు, విద్యార్థుల సౌకర్యార్థం ఆయా దరఖాస్తుల స్వీకరణ గడువును ఏప్రిల్‌ 15 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

14 మంది విద్యుత్‌ అధికారులకు షోకాజ్‌

ప్రజాశక్తి -హైదరాబాద్‌ బ్యూరో

విద్యుత్‌ బిల్లుల వసూళ్లలో తేడాలు రావడంతో 14 మంది విద్యుత్‌ అధికారులపై ఆ శాఖ ఉన్నతాధికారి షోకాజ్‌ నోటీసులు జారీ చేసిన ఘటన సంచలనం కలిగించింది. ఇంత పెద్ద సంఖ్యలో అధికారులకు షోకాజ్‌ నోటీసులు అందించడం ఇదే ప్రథమంగా భావిస్తున్నారు. నాగర్‌ కర్నూలు జిల్లాలోని నాలుగు డివిజన్ల పరిధిలో నెలకు రూ. 9.32 లక్షలు తేడా రావడాన్ని విజిలెన్స్‌ అధికారులు గుర్తించారు. ఈ విషయాన్ని ఎస్‌పిడిసిఎల్‌ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అధికారులకు షోకాజ్‌ నోటీసులు జారీ చేశారు. 9 మంది ఏఈలు, నలుగురు ఏడీలు, ఒక డీఈకి నోటీసులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాలు, తండాల్లో విద్యుత్‌ మీటర్లు లేకుండా వాడుతున్న కరెంట్‌ వల్ల తేడా వచ్చినట్లు సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌ లీలావతి వెల్లడించారు. మీటర్లు లేని చోట్ల తాజాగా మీటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

మహిళా రైతు సుగుణకు సన్మానం

ప్రజాశక్తి-హైదరాబాద్‌ బ్యూరో

నాగసముద్రం గ్రామానికి చెందిన నందుర్తి సుగుణ మహిళా రైతును గురువారం జగిత్యాల జిల్లా పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశంలో ఆమెను సన్మానించారు. సుగుణ సేంద్రియ సాగుతోపాటు వివిధ్య రకాల పంటలు పండించడంతో ఆమెకు జాతీయ పురస్కారం లభించింది. పరిశోధన సంచాలకులు వెంకటరమణ, వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు సుధారాణిలు సుగుణకు ఉత్తమ మహిళ రైతు అవార్డు అందజేశారు. సహాయ సంచాలకులు శ్రీనివాస్‌, విత్తన సంచాలకులు జగన్మోహన్‌రావు, వెంకటేశ్వర్లులు పాల్గొన్నారు.

టాటా ఎఐఎ నుంచి నూతన ఎన్‌ఎఫ్‌ఒ



హైదరాబాద్‌ : టాటా ఎఐ లైఫ్‌ ఇన్సూరెన్స్‌ (టాటా ఎఐఎ) తాజాగా ప్రొటెక్ట్‌ యువర్‌ ఫ్యూచర్‌ నినాదం ఎన్‌ఎఫ్‌ఒలను విడుదల చేసింది. ఇందులో సస్టెయినబుల్‌ ఈక్విటీ ఫండ్‌ ఒకటి కాగా మరొకటి డైనమిక్‌ అడ్వాంటేజ్‌ ఫండ్‌. యూనిట్‌కు రూ.10తో ఎన్‌ఎవి వద్ద లభ్యమవుతాయని ఆ సంస్థ తెలిపింది. వీటిలో వచ్చే మొత్తాలను మూల ధన వద్ధిని అందిస్తాయని పేర్కొంది. వీటిలోని ఫండ్స్‌ను ప్రధానంగా సస్టెయినబుల్‌ లేదా పర్యావరణ, సామాజిక, పరిపాలన అనుకూల ప్రక్రియల రంగాల్లోని కంపెనీలలో పెట్టుబడులు పెట్టనున్నట్లు పేర్కొంది.

సిపిఐ సీనియర్‌ నేత పువ్వాడకు అస్వస్థత

హైదరాబాద్‌ కిమ్స్‌ ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

సిపిఐ సీనియర్‌ నాయకులు, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరరావు బుధవారం(29న) ఖమ్మంలో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దాంతో సికింద్రాబాద్‌లోని కిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. ఖమ్మంలోని తన నివాసంలో అస్వస్థతకు గురైన పువ్వాడకు తొలుత మమత ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించారు. హైదరాబాద్‌ నుంచి వచ్చిన ఆయన కుమారుడు, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌.. తన తండ్రికి మెరుగైన వైద్యం అందించేందుకు వెంటనే అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు అంబులెన్స్‌కు అంతరాయం కలుగకుండా ఆ మార్గంలో గ్రీన్‌చానెల్‌ను ఏర్పాటు చేశారు. పువ్వాడ నాగేశ్వరరావుకు కిమ్స్‌ వైద్యులు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉంచి పువ్వాడకు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. తన తండ్రి ఆరోగ్యం దృష్ట్యా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో గురువారం భద్రాచలంలో జరిగే సీతారాముల కళ్యాణానికి మంత్రి హాజరు కాలేదు. పువ్వాడ నాగేశ్వరరావుకు ఇద్దరు కుమారులు పెద్ద కుమారుడు పువ్వాడ ఉదయ్‌ కుమార్‌ అనారోగ్య సమస్యలతో గతంలో మృతి చెందారు. ద్వితీయ కుమారుడైన అజయ్‌ కుమార్‌ బిఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్నారు.

ఉపాధ్యాయుడి ఖాతా నుంచి రెండు లక్షలు మాయం

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

జయశంకర్‌ భూపాలపల్లిజిల్లాలోని ఒక మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడికి బుధవారం రాత్రి అజ్ఞాత వ్యక్తి నుంచి సెల్‌ఫోన్‌కు ' మీ బ్యాంకు ఖాతా నంబర్‌ బ్లాక్‌ చేయబడింది' అని మెసేజ్‌ వచ్చింది. దీంతో కంగారు పడి మెసేజ్‌ పంపిన నంబర్‌కు ఫోన్‌ చేయగా, మొదట సిబిఎఫ్‌ నంబర్‌ చెబితే సరిపోతుందని నమ్మించాడు. అనంతరం ఆధార్‌, ఏటిఎం కార్డు నంబర్లు కూడా అడగడంతో సదరు ఉపాధ్యాయుడు అవి కూడా చెప్పాడు.

మరికొద్దిసేపటికి ఫోన్‌ చేసి మీ బ్యాంకు అకౌంట్‌కు ఆధార్‌కార్డు నంబర్‌ను లింక్‌ అప్‌డేట్‌ చేశామని, మధ్యమధ్యలో ఓటీపీలు వస్తాయని, చెప్పాలని కోరాడు. అవి చెప్పిన వెంటనే కొద్ది సేపటికే ఉపాధ్యాయుడి బ్యాంకు ఖాతా నుంచి మొదట రూ. లక్ష డబ్బులు డ్రా అయినట్లు మెసేజ్‌ వచ్చింది. దీంతో వెంటనే సైబర్‌ నేరగాడికి ఫోన్‌చేయగా ' మీ డబ్బులు తిరిగి రాత్రి 10 గంటలకు మీ బ్యాంకు అకౌంట్‌లో జమ అవుతాయని' నమ్మించాడు. ఆ తర్వాత మూడుసార్లు వరుసగా రూ.25వేలు, మరోసారి రూ.50వేలు, ఇంకోసారి రూ.50 వేలు డ్రా అయినట్లు ఉపాధ్యాయుడి సెల్‌ఫోన్‌ నంబర్‌కు మెసేజ్‌లు వచ్చాయి. మొత్తం రూ.2.25 లక్షలు సైబర్‌ నేరగాడు కాజేశాడు.

తాను మోసపోయినట్లు గమనించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఈ విషయాన్ని కుమారుడికి తెలుపగా వెంటనే రాత్రి సైబర్‌ క్రైం విభాగ సైట్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం సైబర్‌ క్రైం టోల్‌ఫ్రీ నంబర్‌ ద్వారా కూడా ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడి కుమారుడు ఇటీవల బీటెక్‌ పూర్తి చేయగా అతడిని విదేశాలకు పంపేందుకు అవసరమైన బ్యాంకు బ్యాలెన్స్‌ కోసం డబ్బులను ఖాతాలో ఉంచుకున్నాడు. సైబర్‌ నేరగాడు తెలుగులోనే మాట్లాడడని, డబ్బులు డ్రా అయిన తర్వాత మోసపోయానని గుర్తించానని బాధితుడు వాపోయాడు.

1010 ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

- ఐకెపి కేంద్రాలను వెంటనే తెరవాలి
- జూలకంటి డిమాండ్‌

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

ఆయకట్టు, బావుల కింద తొలుత నాటుపెట్టిన 1010 వరి ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్‌ చేశారు. గురువారం మిర్యాలగూడ సబ్‌మార్కెట్‌ యార్డు పరిధిలోని దామరచర్లలో ఆయన పర్యటించారు.

రైతులను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వమే ఆ ధాన్యాన్ని ఐకెపి కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్‌ చేశారు. రైతులు మార్కెట్‌ యార్డులకు ధాన్యాన్ని తెచ్చి పది, 15 రోజులుగా కాపున్నారని ఐకెపి కేంద్రాలను ఇంత వరకు తెరవలేదని విమర్శించారు. దీంతో వారు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు అక్కడ కనీస సౌకర్యాలేవని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీరు, కరెంటు, రోడ్డు, టార్పాలిన్‌లు అందుబాటులో లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కనీస సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్టుగానే ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. ఐకెపి కేంద్రాలను వెంటనే తెరవాలని, తద్వారా రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు.

టివిఎస్‌ ఐక్యూబ్‌లో 200 ఇవి స్కూటర్ల డెలివరీ

హైదరాబాద్‌ : నగరంలో నిర్వహించిన సింగిల్‌ డే మెగా డెలివరీ కార్యక్రమంలో 200 టివిఎస్‌ ఐక్యూబ్‌ విద్యుత్‌ స్కూటర్లను డెలివరీ చేసినట్లు టివిఎస్‌ తెలిపింది. ఈ వాహనాలను అత్యున్నత శ్రేణి ఫీచర్లతో ఆవిష్కరించినట్లు పేర్కొంది. ప్రస్తుతం టివిఎస్‌ ఐక్యూబ్‌, టివిఎస్‌ ఐక్యూబ్‌ ఎస్‌ ఆన్‌ రోడ్‌ ధరలను రూ.1,15,293గా, రూ.1,21,413గా నిర్ణయించినట్లు తెలిపింది. టివిఎస్‌ మోటార్‌ డిజైన్డ్‌ బ్యాటరీ ప్రమాణాలు అయిన 3.4 కిలోవాట్‌హవర్‌, ఒక్కసారి చార్జ్‌ చేస్తే ప్రాక్టికల్‌గా రోడ్డుపై 100 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తాయని పేర్కొంది. దీనిలో ఏడంగుళాల టిఎఫ్‌టి డిస్‌ప్లే, హెచ్‌ఎంఐ కంట్రోల్స్‌, రివర్స్‌ పార్కింగ్‌ ఫీచర్లు ఉన్నాయని తెలిపింది.

దుమ్ము కమ్మేస్తోంది..!

- తర్నం వంతెన కుంగుబాటుతో రాకపోకలు బంద్‌
- గ్రామాల మీదుగా వాహనాల మళ్లింపు
- నిరాల-లాండసాంగ్వి రోడ్డు అస్తవ్యస్తం



ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

పచ్చని పంట పొలాల మధ్య అలరారిన ఆ గ్రామాల ఇప్పుడు దుమ్ము కమ్మేస్తోంది. రోజూ వందల సంఖ్యలో భారీ వాహనాల రాకపోకల కారణంగా రోడ్డు అస్తవ్యస్తంగా మారుతోంది. ఈ దారి గుండా ప్రయాణం నిత్యం నరకంగా మారింది. ఓ చోట బ్రిడ్జి కుంగిపోవడంతో అక్కడ రాకపోకలు నిలిపేసి ప్రత్యామ్నాయంగా గ్రామాల నుంచి మళ్లించడంతోనే సమస్య మొదలైంది. కానీ రాకపోకలు మళ్లించిన అధికారులు బ్రిడ్జి నిర్మాణంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామాలు దుమ్ము కొట్టుకుపోతున్నాయి. నిరాల నుంచి లాండసాంగ్వి వరకు సుమారు తొమ్మిది కిలోమీటర్ల రోడ్డు దుస్థితి ఇది.

ఆదిలాబాద్‌ గ్రామీణం, జైనథ్‌ మండలాల పరిధిలోని లాండసాంగ్వి, అర్లి, అడ, ముక్తాపూర్‌, నిరాల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జైనథ్‌ మండలం తర్నం బ్రిడ్జి కుంగింది. రాకపోకలు నిలిచాయి. దీంతో ప్రత్యామ్నాయంగా మహారాష్ట్ర, బేల, జైనథ్‌ మండలాల మీదుగా వచ్చే భారీ వాహనాలను నిరాల నుంచి లాండసాంగ్వి రోడ్డు మీదుగా మళ్లించారు. గ్రామాల మధ్య అనుసంధానం కోసం నిర్మించిన చిన్న రోడ్డు కావడం.. భారీ వాహనాలు వెళ్తుండటం కారణంగా రోడ్డు అస్తవ్యస్తంగా మారింది.

ఎగిసిపడుతున్న దుమ్ము..!

ఆదిలాబాద్‌ జిల్లా సరిహద్దున మహారాష్ట్రలో సిమెంట్‌ పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. అక్కడి నుంచి సిమెంట్‌ ఇతరత్రా వస్తువుల రవాణా కోసం మన రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి భారీ లారీలు వెళ్తుంటాయి. భోరజ్‌ నుంచి జైనథ్‌, బేల మండలాల మీదుగా మహారాష్ట్రకు వెళ్ల ుంటాయి. అక్కడుంచి ఇదే మార్గం గుండా రావాల్సి ఉండగా మధ్యలో తర్నం బ్రిడ్జి వద్ద రాకపోకలు నిలిపివేయడంతో ఈ వాహనాలు నెలన్నర రోజులుగా నిరాల-లాండసాంగ్వి మీదుగా ప్రయాణిస్తున్నాయి. దీంతో రోజూ వందలది లారీలు, ఆర్టీసీ బస్సులు, పెద్ద వాహనాలు ఇదే మార్గం గుండా వెళ్తుండటంతో భారీ ఎత్తున దుమ్ము లేస్తోంది. రోడ్డు కూడా గుంతలుగా ఉండటం.. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. తర్నం బ్రిడ్జి నిర్మాణం జాతీయ రహదారుల సంస్థ ఆధీనంలో ఉండటంతో వారే నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు ఈ బ్రిడ్జి నిర్మాణంపై ఎలాంటి కదలిక కనిపించడం లేదు.

పంటలు దెబ్బతింటున్నాయి : రైతు భరత్‌ రాందాస్‌- అర్లి

మా ఊరి పక్క నుంచి భారీ వాహనాలు వెళ్తున్నాయి. రోజూ వందల సంఖ్యలో వాహనాల రాకపోకల కారణంగా దుమ్ము లేవడంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయి. ఎడ్లబండ్లపై కూడా వెళ్లలేని పరిస్థితి. కండ్లలో దుమ్ము పడుతోంది. అధికారులు ఈ రోడ్డును వెంటనే బాగు చేయించాలి.

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు : పిడుగు స్వామి, జైనథ్‌

నిరాల వైపు నుంచి లాండసాంగ్వి మీదుగా ఆదిలాబాద్‌కు వెళ్ళాల్సి వస్తోంది. ఈ రోడ్డు కూడా గుంతలతో పూర్తిగా చెడిపోయింది. మరోపక్క ఇదే మార్గంలో భారీ వాహనాలు వెళ్తుండటంతో దుమ్ము రేగుతోంది. అధికారులు వెంటనే బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేయాలి.

బాత్రూంలోనే మహిళ ప్రసవం

- నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

పురిటి నొప్పులు అధికమైన సందర్భంలో బాత్రూమ్‌కు వెళ్లి అక్కడే ఓ గర్భిణీ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన బుధవారం రాత్రి నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలో వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి.. నిడమనూరు మండలం ధర్మపురం గ్రామానికి చెందిన గర్భిణి పార్వతమ్మ మూడ్రోజుల కిందట పురిటి నొప్పులతో నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో చేరింది. మొదటి కాన్పులో సాధారణ డెలివరీ అయిందని, రెండో కాన్పు నార్మల్‌ డెలివరీ అవుతుందని డాక్టర్లు చెప్పారు. డెలివరీకి ఇంకా సమయం ఉందన్నారు. అయితే, కొద్దిసేపటికే ఆ గర్భిణి బాత్రూంకు వెళ్లింది. ఈ క్రమంలో అక్కడే బిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది పుట్టిన బాబును వెంటనే ఐసియుకి తరలించి వైద్యం అందించారు. ఈ సందర్భంగా గర్భిణి బంధువులు మాట్లాడుతూ.. మధ్యాహ్నం మూడు గంటల నుంచి తమ కూతురు నొప్పులతో బాధపడుతున్నా వైద్యులు పట్టించుకోలేదని తెలిపారు. నొప్పులు అధికమవడంతో బాత్‌ రూమ్‌లోనే బాబుకు జన్మనిచ్చిందని తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

రాష్ట్రంలో 106 స్క్రీన్లకు విస్తరించిన పివిఆర్‌ ఐనాక్స్‌

హైదరాబాద్‌ : దేశంలో అత్యంత ప్రీమియం సినిమా ప్రదర్శన కంపెనీ పివిఆర్‌ ఐనాక్స్‌ రాష్ట్రంలో 106 స్క్రీన్లకు విస్తరించినట్లు తెలిపింది. ఆర్మూర్‌లో కొత్తగా నాలుగు స్క్రీన్ల మల్టీప్లెక్స్‌ను ప్రారంభించడంతో ఈ స్థాయికి చేరినట్లు పేర్కొంది. ఇది రాష్ట్రంలో తమకు 19వ ప్రాపర్టీ అని వెల్లడించింది. దక్షిణాదిలో 94 ప్రాపర్టీలలో 523 స్క్రీన్లను కలిగి ఉన్నట్లు పేర్కొంది. అత్యాధునిక టెక్నాలజీతో ఆర్మూర్‌లో ఏర్పాటు చేసిన మల్టీప్లెక్స్‌లో 1254 మంది ప్రేక్షకుల సీటింగ్‌ సామర్థ్యం కలదని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశంలో కొత్తగా 24 నగరాల్లో 30 ప్రాపర్టీలలో 168 స్క్రీన్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.

విద్యార్థులకు వండర్‌లా 35% రాయితీ

హైదరాబాద్‌ : ఇటీవల కాలంలో బోర్డు పరీక్షలకు హాజరైన విద్యార్థులకు అత్యంత ఆకర్షణీయమైన రాయితీ ఆఫర్లను అందిస్తున్నట్లు అమ్యూజ్‌మెంట్‌ పార్క్‌ చైన్‌ వండర్‌లా హాలీడేస్‌ తెలిపింది. 2022-23 విద్యా సంవత్సరంలో తమ 10, 11, 12వ తరగతి బోర్డు పరీక్షలకు హాజరైన విద్యార్థులు హాల్‌టికెట్‌తో వచ్చి రాయితీని పొందవచ్చని పేర్కొంది. బెంగళూరు, హైదరాబాద్‌, కొచ్చి పార్కుల వద్ద ప్రవేశ టికెట్లపై 35 శాతం డిస్కౌంట్‌ను పొందవచ్చని తెలిపింది.

గుండె పంపింగ్‌ సామర్థ్యం పెంచుతున్న రిహాబ్‌

- ఆయుష్షుతో పాటు జీవన ప్రమాణం మెరుగు
- మారథాన్‌లో పాల్గొంటున్న రోగులు
- ఉద్యోగాలకు అవసరమైన ఫిట్‌నెస్‌కు దోహదం
- దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో కార్డియాక్‌ రిహాబ్‌

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

వైద్య పరిశోధనలు రోజు రోజుకు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. నిన్న అసాధ్యం అనుకున్న అనేక సంగతులు నేడు సాధ్యమవుతున్నాయి. గుండె సంబంధిత రోగులు బతికి బట్టకడితే చాలనుకునే రోజుల నుంచి గుండె శస్త్రచికిత్స చేయించుకున్న వారు సైతం మారథాన్‌ లాంటి పరుగు పందెంల్లో పాల్గొంటూ బెరా... అనిపించే దశకు వైద్యశాస్త్రం చేరింది. ఈ క్రమంలో రోగుల ఆయుష్షు పెరగడమే గాకుండా, జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడుతుండటం గమనార్హం. ప్రభుత్వ ఉద్యోగాలు పొందే వారిలో కొన్నింటికి అవసరమైన ఫిట్‌నెస్‌ కల్పించి వారు సైతం ఆ తర్వాత ఆయా పరీక్షల్లో సైతం అర్హత సాధిస్తున్నారు. 50 సంవత్సరాల నేవీ ఆఫీసర్‌ ఒకరు హార్ట్‌ అటాక్‌ కారణంగా స్టెంట్‌ వేసుకున్నారు. గుండె కండరాలు బలహీనపడి దాని పంపింగ్‌ సామర్థ్యం 40 శాతానికి పడిపోయింది. దీంతో ఉద్యోగం చేయగల సామర్థ్యం అతను కోల్పోయినట్టుగా అధికారులు నిర్ధారించారు. కార్డియాక్‌ రిహాబ్‌ తర్వాత అదే వ్యక్తి సంబంధిత పరీక్షలో అర్హత సాధించారు. ఇలాగే పలువురు రిహాబ్‌తో సంతోషకరమైన కొత్త జీవితాన్ని అనుభవిస్తున్నారు. ఇదంతా కార్డియాక్‌ రిహాబ్‌ పుణ్యమే. దాని ద్వారా కేవలం మూడు నెలల వ్యవధిలో గుండె పంపింగ్‌ సామర్థ్యం పెరుగుతుండటం గమనార్హం. ఇది బిపిఎల్‌వారు గుండె జబ్బు వచ్చే అవకాశముల రిస్క్‌ గ్రూప్‌ వారితో పాటు ఇది వరకే గుండె జబ్బులకు చికిత్స తీసుకుంటున్న వారు, తీసుకున్న వారు, శస్త్రచికిత్స చేయించుకున్న వారికి కూడా ఉపయోగపడుతుండడం ఆధునిక పరిశోధనలు ఇచ్చిన వరమే అని చెప్పాలి.

కరోనా తర్వాత కాలంలో ఎక్కువ మంది గుండెపోటుకు గురి కావడంతో పాటు మరణాల సంఖ్య కూడా పెరుగుతోంది. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ లెక్కల ప్రకారం ప్రతి రోజు రాష్ట్రంలో 66 మంది గుండెపోటుకు గురవుతూ మరణిస్తున్నారు. వీరిని సకాలంలో గుర్తించి సిపిఆర్‌ (కార్డియోపల్మనరీ రెససిటేషన్‌) చేయగలిగితే చాలా మంది ప్రాణాలను నిలుపొచ్చనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సిపిఆర్‌ శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోంది. ప్రతి ఒక్కరు దీనిపై అవగాహన పెంచుకోవాలనుకుంటే జిల్లాల వారీగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. దీనికి తోడు ఉస్మానియా మెడికల్‌ కాలేజీలో స్కిల్‌ ల్యాబ్‌లో వైద్య సిబ్బందికి గుండెతో పాటు ఇతర అత్యవసర పరిస్థితిలో వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణనిస్తున్నారు.

కార్డియాక్‌ రిహాబ్‌తో నివారణ

అత్యవసర పరిస్థితి తలెత్తిన తర్వాత సిపిఆర్‌, ఇతరత్రా జాగ్రత్తలపై ప్రభుత్వంగాంల శిక్షణ కొనసాగుతుండే, మరోవైపు ప్రయివేటులో అలాంటివి రాకుండా నివారించేందుకు కార్డియాక్‌ రిహాబ్‌ వంటి చికిత్సలు అందుబాటులోకి తెస్తున్నాయి. గుండె జబ్బులు వచ్చే అవకాశం డయాబెటిస్‌, కొలెస్ట్రాల్‌, స్మోకింగ్‌, ఆల్కహాల్‌ సేవించడం, హై బిపి ప్రెషర్‌, ఒత్తిడితో కూడిన జీవితం, ఎప్పుడు కూర్చునే ఉండటం, కుటుంబ ఆరోగ్య చరిత్ర, గుర్తించని కారణాలున్న వారికి ఎక్కువగా ఉంటుంది. వీరికి హార్ట్‌ అటాక్‌ వచ్చిన తర్వాత ఆంజియోప్లాస్టీ గానీ, బైపాస్‌ సర్జరీ చేయడం గానీ చేస్తారు. దాంతో పాటు రోగి కొన్ని ఔషధాలు వాడాల్సి ఉంటుంది. ఇలాంటి వారికి కార్డియాక్‌ రిహాబ్‌తో భవిష్యత్తులో గుండె జబ్బు రాకుండా నివారించుకునే అవకాశముంది. ఈ రిహాబ్‌ ద్వారా కండరాలు బలహీనపడి గుండె కొంత మేర ఫెయిల్‌ అయినా కూడా ఆ కండరాల్లో ఉత్తేజం కలిగించి సామర్థ్యం పెరిగి డయాబెటిస్‌ బారిన పడే ప్రమాదాన్ని తగ్గించుకునే వీలుంది. రిహాబ్‌ ద్వారా జన్యుపర్ల మార్పుల ద్వారా వారసత్వ ప్రమాదాలను తప్పించుకోవచ్చు. హై బిడ్‌ ప్రెషర్‌ ఉన్న వారికి గుండె బాగా గట్టిపడి దాని కండరాల సైజు చిన్నగా మారుతుంది. ఇలాంటి వారికి హార్ట్‌ అటాక్‌ వచ్చే అవకాశం మిగిలిన వారి కన్నా ఎక్కువగా ఉంటుంది. రిహాబ్‌ తర్వాత కండరాల్లో పాజిటివ్‌ మార్పులు వస్తున్నట్టు గుర్తించారు. రిహాబ్‌ తర్వాత శరీరంగా దృఢంగా మారి ఇంటి దగ్గర ఆదమరచే ఆరుబయట తిరిగే అవకాశముంది. రిహాబ్‌ కావాలనుకునే వారు మరిన్ని వివరాలకు ఎ.ఎస్‌.ఐఐఆక్‌ఎస్‌ఎస్పన్‌ప్పను సంప్రదించవచ్చు.

గుండె జబ్బుల నివారణకు మేలు :డాక్టర్‌ మురళీధర్‌ బాబీ

గుండె జబ్బులు, గుండెపోటు పదే పదే వచ్చే రోగులకు ముందుగానే వాటిని నివారించేందుకు కార్డియాక్‌ రిహాబ్‌ దోహదపడుతుందని కార్డియాక్‌ రిహాబ్‌ స్పెషలిస్టు డాక్టర్‌ మురళీధర్‌ బాబీ తెలిపారు. ప్రభుత్వపరంగా రిహాబ్‌ పై ప్రజలకు అవగాహన కల్పిస్తే బాగుంటుందని సూచించారు. రిహాబ్‌ సేవలను ప్రజలకు చేరువ చేయగలిగితే అత్యవసర పరిస్థితులు తలెత్తకుండా ముందే నివారించవచ్చని చెప్పారు.